ప్రజాశక్తి
సోమవారం 10 మార్చి 2025 | 5 | అనంతపురం

పాదయాత్ర సందర్భంగా కూడేరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న నల్లప్ప

దర్జాగా కబ్జా

పికెపి కాలువను కబ్జా చేసుకుని నిర్మించుకున్న గృహాలు

చెరువు, నీటిపారుదల శాఖ కాలువల స్థలాలను వదలని దుస్థితి

ఆక్రమణకు గురైన పికెబి సప్లయ్ ఛానల్

నీటి సరఫరా కాలువలను మురుగు కాలువలుగా మార్చిన వైనం

నిద్రావస్థలో ఇరిగేషన్ అధికారులు

కాదేదీ కబ్జాకు అనర్హం.... అన్న చందంగా హిందూపురంలో ప్రభుత్వ స్థలం ఏ శాఖకు చెందినదైనా కబ్జాకు గురవుతోంది. కొందరు నీటిపారుదల శాఖ స్థలాలను కబ్జా చేసుకుని ఏకంగా వాణిజ్య భవనాలు, గృహాలను నిర్మించారు. వీరి బాటలోనే మున్సిపల్ అధికారులు నడిచారు. నీటి సరఫరా కాలువలను మురుగు కాలువలుగా మార్చారు. దీంతో పట్టణంలో ఉన్న చెరువులన్నీ మురుగుతో కంపు కొడుతున్నాయి. వీటిని కట్టడి చేయాల్సిన నీటిపారుదల శాఖ అధికారులు కబ్జాదారులతో ముడుపులు తీసుకుని తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి.

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణానికి మూడు వైపులా ప్రధాన చెరువులు ఉన్నాయి. అనంతపురం వైపు కొట్నూరు చెరువు, బెంగళూరు రోడ్డు వైపు సూగురు చెరువు, లేపాక్షి వైపు శ్రీకంఠపురం చెరువు ఉన్నాయి. అయితే ఇందులో కొట్నూరు, సుగూరు చెరువు స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. ఏకంగా కొందరు ప్లాట్లను ఏర్పాటు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. గత కొంతకాలంగా హిందూపురంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పెద్ద ఎత్తున సాగుతుండడంతో ప్రభుత్వ స్థలాల ఆక్రమణ యథేచ్ఛగా కొనసాగుతోంది. ఈ విషయంపై సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు రాజకీయ నాయకుల అండదండలతో ఇష్టారాజ్యంగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని రియల్ దందాను కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా పెన్నా నది నుండి కొట్నూరు చెరువుకు నీరు అందించే పెన్నా కుముద్వతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సప్లై ఛానల్ (పీకేబీ) ఆక్రమణలకు గురైంది. దీనికి తోడు ఎప్పటికప్పుడు పూడిక తీయించాల్సిన అధికారులు వాటిపై దృష్టి సారించకపోవడంతో పెద్ద ఎత్తున సప్లై ఛానల్‌లో మురుగు నిలబడి కంపు కొట్టడంతో పాటు కంపచెట్లు పెరిగిపోయాయి. ఇదే అదునుగా భావించిన కొందరు అక్రమార్కులు సప్లై ఛానల్ పొడవునా నీటి పారుదల శాఖకు చెందిన స్థలాన్ని కబ్జా చేసుకుని ఇళ్లను నిర్మాణాలు చేసి వాటిని అద్దెకు సైతం ఇచ్చారు. పెన్నా నది ద్వారా నీరు ప్రవహిస్తే పరిగి రోడ్డు లోని కట్ట కాలువ గుండా ఆర్టీసీ కాలనీ సప్లై ఛానల్ మీదుగా కొట్నూరు చెరువుకు నీరు చేరాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఆ సప్లై ఛానల్ ఆక్రమణలకు గురి కావడంతో పాటు ఉన్న సప్లై ఛానల్ లో కంపచెట్లతో పాటు పూడిక పెరిగిపోవడంతో నీరు పారే పరిస్థితులు కనిపించడం లేదు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు నీటిపారుదల శాఖ అధికారులతో కుమ్మక్కై ఎలాంటి ఆటంకం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని కబ్జాలకు పాల్పడినట్లు సర్వత్రా ఆరోపణల వ్యక్తమవుతున్నాయి. ఎప్పటికప్పుడు పూడికను తీయించాల్సిన నీటిపారుదల శాఖ అధికారులు మాత్రం సప్లై ఛానల్ పరిస్థితి ఏమాత్రం పట్టించుకోవటం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుత స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకొని గొల్లపల్లి రిజర్వాయర్ నుండి హంద్రీనీవా కాలువకు నీటిని మళ్లించేందుకు చర్యలు చేపట్టారు. ఒకవేళ ఆ నీరు హిందూపురం పట్టణంలో ప్రవహించాల్సి వస్తే సప్లై ఛానల్ పూర్తిగా ఆక్రమణలకు గురి కావడం, పూడికతో పాటు చెట్లు ఏపుగా పెరిగి పోవడంతో నీరు ఎలా ప్రవహిస్తుందో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు నీటిపారుదల శాఖకు సంబంధించిన సప్లై ఛానల్ ఆక్రమణలకు గురికాగా అదే తరహాలో మున్సిపల్ కాలువలు సైతం ఆక్రమణలకు గురవుతున్నాయి. రాజకీయ పలుకుబడి ఉన్న కొంతమంది మున్సిపల్ కాలువలను ఆక్రమించుకొని యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేసుకున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇదే తరహాలోనే మున్సిపల్ అధికారులు సైతం మున్సిపల్ ఖజానాను కొల్లగొట్టేందుకు నీటి పారుదల శాఖకు చెందిన కాలువలను సిమెంట్ వేసి, దానిని మురుగు కాలువలుగా మార్చి కోట్లు కొల్లగొట్టారు. ఈ వ్యవహారమంతా అధికారులకు తెలిసినా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉండగా గతంలో సుప్రీంకోర్టు ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు కొట్నూరు చెరువులో ఆక్రమణలు తొలగించేందుకు అధికార యంత్రాంగం ప్రయత్నాలు చేయగా అప్పట్లో రాజకీయ కారణాలతో వెనుదిరిగారు. ప్రస్తుతం ఆ చెరువు పరిధిలోని స్థలం దాదాపు కబ్జాకు గురై ఏకంగా పెద్ద ఎత్తున గృహ నిర్మాణాలు జరిగాయి. సాధారణంగా చెరువు స్థలాలకు ఎలాంటి పట్టాలను అధికారులు మంజూరు చేయడం జరగదు. అయితే చెరువు ముంపు ప్రాంతాల్లో ఉన్న స్థలాలకు పట్టాలు కూడా మంజూరు కావడం గమనార్హం. అదే విధంగా ఆయా కాలనీలో మున్సిపల్ అధికారులు రహదారులు, వీధి దీపాలను సైతం ఏర్పాటు చేశారు. దీంతో రోజురోజుకి చెరువు స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. అదే విధంగా సూగూరు చెరువు ప్రాంతం కూడా ఆక్రమణలకు గురవుతున్నా నీటిపారుదల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కొందరు ద్వితీయ శ్రేణి రాజకీయ నాయకులు చెరువు స్థలాలపై కన్నేసి బినామీలను ఏర్పాటు చేసుకొని కబ్జాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదన్న ధీమాతో ఏకంగా పెద్ద ఎత్తున నిర్మాణాలను సైతం చేసుకొని అద్దెకు ఇచ్చి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. కాగా సాధారణంగా సప్లై ఛానల్, మున్సిపల్ పెద్ద కాలువల పరిసరాల్లో ఎలాంటి నిర్మాణాలు ఉండకూడదన్న నిబంధనలు ఉన్నప్పటికీ అవేవీ ఇక్కడ అమలు కావడం లేదు. ఏకంగా సప్లై ఛానల్, మున్సిపల్ మురుగు కాలువలను ఆనుకొని, వాటిపైన అక్రమ నిర్మాణాలు జరిగాయి. ఇప్పటికైనా నీటిపారుదల, మున్సిపల్ అధికారులు నిద్ర మేల్కొని ఆక్రమణలు గురైన సప్లై ఛానల్, మురుగు కాలవలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ఈ అక్రమాలపై ఆయా శాఖల అధికారులు ఏ మేరకు స్పందిస్తారో వేచి చూడాల్సుంది.

నీటిపారుదల శాఖ కాలువను మురుగు కాలువగా మార్చిన దృశ్యం

గిట్టుబాటు ధర కల్పించాలి

కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఒ. నల్లప్ప

రైతుసంఘం ఆధ్వర్యంలో మూడో రోజు కొనసాగిన పాదయాత్ర

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఎపి రైతు సంఘం చేపట్టిన పాదయాత్ర మూడవ రోజు సాగింది. కూడేరు మండలంలోని ముద్దలాపురంలో ప్రారంభమైన యాత్ర కూడేరు, అరవకూరు, కమ్మూరు మీదుగా అనంతపురం శివారు వరకు చేరింది. ఈ యాత్రలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఒ.నల్లప్ప పాల్గొని మద్దతు తెలిపారు. అదే విధంగా మూడవ రోజు జరిగిన యాత్రలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, పండ్లతోటల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివారెడ్డి,అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా కోశాధికారి రాయుడు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఒ.నల్లప్ప మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంటలకు మద్దతు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు అతివృష్టి, అనావృష్టితో దిగుబడులు తగ్గాయని చెప్పారు. మరోవైపు మిర్చి పంటకు ధర లేక మరింత నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. డబ్బీ, కడ్డీ రకంను క్వింటా రూ.50 వేలకు , సింజెంటా రకం రూ.25 వేలకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పప్పుశగన, పత్తి పంటలకు సరైన గిట్టుబాటు ధర లేదన్నారు. ఈ పంటలను గిట్టుబాటు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలపై రైతు సంఘం చేపట్టిన ఈ యాత్రకు కెవిపిఎస్‌గానూ మద్దతు తెలుపుతున్నామని చెప్పారు. ప్రభుత్వం తక్షణం స్పందించి రైతాంగ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు విరూపాక్షి, జిల్లా నాయకులు శ్రీనివాసులు, కొండారెడ్డి, ఓబులేసు, మేక పెద్దన్న, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఎపి రైతు సంఘం సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నాకు పిలుపునిచ్చింది. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఈనెల ఏడవ తేదీన రైతు సంఘం ఉరవకొండలో పాదయాత్రను ప్రారంభించింది. మూడు రోజులుగా ఈ యాత్ర సాగుతూ వచ్చి అనంతపురం నగర శివారు వరకు చేరింది. సోమవారం ఉదయం బళ్లారి బైపాస్ నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర కొనసాగుతుంది. అనంతరం కలెక్టరేట్ ఎదుట గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరుతూ ధర్నా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈ ధర్నా కార్యక్రమంలో రైతులు, రైతు శ్రేయోభిలాషులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మిరప, పత్తి, పప్పుశనగ పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. డబ్బీ, కడ్డీ రకం క్వింటాళుకు రూ.50 వేలు, సింజెంటా రకం రూ.25 వేలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పప్పుశనగ పంటను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈడిమాండ్లపై సాగుతున్న ఈ ధర్నాకు అందరూ మద్దతు తెలపాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్

పి-4 సర్వే పేరుతో పేదలను కుదిస్తే ప్రతిఘటన

ఎన్నికల వాగ్దానాల అమలు కోసం ఉద్యమాలకు సిద్ధం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి - గుంతకల్లు

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సంక్షేమ పథకాలకు కోత పెట్టేందుకు 'పి4' సర్వేను చేపట్టిందని,ఎన్నికల వాగ్దానాల అమలుకు ఉద్యమాలు చేసేందుకు ప్రజలు సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక గుంతకల్లు సిపిఎం కార్యాలయంలో పట్టణ కార్యదర్శి మారుతీ ప్రసాద్ అధ్యక్షతన సిపిఎం నియోజకవర్గ విస్తృతస్థాయి మసమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బిఫోర్ విధానం అమలు చేయడం సంక్షేమ పథకాల నుండి పేదలను దూరం చేయడానికే అన్నారు. నిరుద్యోగ భృతి, సాగునీటి వనరుల అభివృద్ధి, పేదరిక నిర్మూలన గురించి ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని గడచిన తొమ్మిది నెలలుగా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ప్రజలపై విద్యుత్ ఛార్జీల అదనపు భారం వేస్తూనే తమ కూటమి అధికారానికి వచ్చాక విద్యుత్ చార్జీలు పెంచలేదని శాసనసభలో మంత్రి జి.రవికుమార్ అవాస్తవాలు చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండు పర్యాయాలు ట్రూ అప్/ ఎఫ్‌పిపిసిఎ పేరుతో సుమారు పదహారు వేల కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై వేసిన మాట నిజం కాదా? అని ప్రశ్నించారు. అంతేగాక గత వైసిపి సర్కారు యూనిట్‌కు ఆరు పైసలుగా ఉన్న విద్యుత్ సుంకాన్ని ఏకంగా రూపాయికి పెంచితే దానికి చట్టబద్ధత కల్పించింది టిడిపి కూటమి ప్రభుత్వమే కదా! అని ప్రశ్నించారు.ఇప్పటికీ ప్రతి నెలా ప్రతి యూనిట్‌కు 40 పైసల చొప్పున

ఎఫ్‌పిపిసిఎ చార్జీలను అదనంగా వసూలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎనభై లక్షల మంది పేదలు ఉంటే కేవలం 40 లక్షల మంది పేదలకు మాత్రమే పథకాలను అమలు చేసేందుకు కుట్రపూరితంగా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వేగంగా అమలు చేసి ప్రజలపై భారలా మోపుతోందని అన్నారు. ఇటీవల క్రైస్తవ చర్చిల సర్వే పేరుతో మత విద్వేషానికి ప్రయత్నాలు జరిగాయని గుర్తు చేశారు.అంగన్వాడీ,ఆశ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి. శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు సాకే నాగరాజు, కసాపురం రమేష్, జగ్గిలి రమేష్, సురేంద్ర, రంగమ్మ, గుత్తి కార్యదర్శి నిర్మల, మల్లికార్జున, పట్టణ కమిటీ సభ్యులు, శాఖా కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సమాన హక్కులు అమలయ్యే వరకు పోరాటం

సామాజిక వేత్త దేవి

'అనంత'లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖ సామాజిక వేత్త దేవి

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

సమాజంలో మహిళలకు సమాన హక్కులు అమలు అయ్యే వరకు మహిళాలోకం ఐక్యమత్యంతో పోరాడుదామని ప్రముఖ సామాజిక వేత్త దేవి అన్నారు. విద్యార్థినులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న పేర్కొన్నారు. అనంత మహిళా వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు స్థానిక లలితకళాపరిషత్‌లో ఘనంగా నిర్వహించారు. తొలుత క్రిష్ణ కళామందిరం నుంచి లలితకళాపరిషత్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ప్రముఖ మానసిక వైద్యనిపుణులు డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, గైనకాలజిస్ట్ డాక్టర్ బాలాకుమారి ర్యాలీని ప్రారంభించారు. వేలాదిగా మహిళలు, విద్యార్థినిలు ర్యాలీలో పాల్గొని నృత్య ప్రదర్శన, కోలాటం, వంటి ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం లలితకళాపరిషత్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంత మహిళ వేదిక సభ్యులు, ఎల్‌కెపి కార్యదర్శి పద్మజ, జెవివి నాయకురాలు డాక్టర్ ప్రసూన అధ్యక్షతన డాక్టర్ హేమలత ఆహ్వానితులుగా నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, సామాజిక వేత్త దేవి, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, కెనరాబ్యాంక్ రీజనల్ మేనేజర్ యాదయ్య, ప్రాంగణం అధికారి వనజా అక్కమ్మ, లక్ష్మి ఇండస్ట్రీస్ అధినేత సందీప్‌కుమార్, రెడ్స్ భానుజా, ఇన్నర్‌వీల్ జయంతి, శ్రీవల్లి, స్టాఫ్ నర్స్ అసోసియేషన్ లత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముఖ్య వక్తగా హాజరైన సామాజికవేత్త దేవి మాట్లాడుతూ 78 స్వాతంత్ర్యంలోనూ మహిళలకు సమాన హక్కులు లేవన్నారు. సమాజంలో కుటుంబం నుంచి ఆడ, మగ వ్యత్యాసం ఉందని, ఆస్తి హక్కులో సమానత్వం కొరవడిందని అన్నారు. సమానత్వం కోసం పోరాడుతున్నది మగవారి మీద కాదని, మహిళలు సమానులు కాదని చెప్పే భావాలపై అని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం, అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం రెండు ఒక్కటే అని వాటి సాధన కోసం కలిసి పోరాడుదామని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథి అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ తాను మహిళగా ఐఎఎస్ చదివి మీ ముందు అధికారిగా నిలవడానికి తల్లి తండ్రులు, గురువుల ప్రోత్సాహం, తన పట్టుదల, ఉన్నత ఆశయంతోనే సాధ్యమైందన్నారు. ప్రాంగణం అధికారి వనజా అక్కమ్మ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు దోహదపడాలన్నారు. కెనరా బ్యాంక్ ఆర్‌ఎం యాదయ్య మాట్లాడుతూ మహిళలకు క్యాన్సర్ రక్షణ బీమా సౌకర్యం కెనరా బ్యాంక్ కల్పిస్తోందన్నారు. డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ మహిళా సమానత్వం సాధన కోసం త్వరపడి పని చేయాలన్నారు. లలిత కళాపరిషత్ పద్మజ, డాక్టర్ హేమలత మాట్లాడుతూ 25 అసోసియేషన్‌లు సంయుక్తంగా అనంత మహిళా వేదికగా ఏర్పడి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న మహిళలకు ప్రశంసా పత్రాలతో సన్మానించారు. లక్ష్మి ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో వారికి చీరలు అందజేశారు. అనంతరం విద్యార్థినులు, మహిళలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు బృందా, జెవివి నాయకులు లక్ష్మి, శశికళ, మాధవిలత, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి రమాదేవి, శ్రామిక మహిళా నాగమణి, ఐద్వా చంద్రిక, రామాంజినమ్మ, అశ్విని, యుటిఎఫ్ నాయకులు సరళ, మున్సిపల్ వర్కర్స్ లక్ష్మినరసమ్మ, ఆశా యూనియన్ లక్ష్మి, మధ్యాహ్న భోజనం పద్మావతి, 108 యూనియన్ అనిత, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

ఎస్పీ వి. రత్న

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో నేరాల నియంత్రణకు గట్టి చర్యలు తీసుకుంటున్నామని ప్రజలకు పోలీసులు పట్ల మంచి అభిప్రాయం ఏర్పడే విధంగా విధులు నిర్వర్తిస్తున్నామని ఆ జిల్లా ఎస్పీ వి రత్న పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వివరించారు.



ప్రశ్న : జిల్లాలో మహిళల భద్రతపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: శ్రీ సత్య సాయి జిల్లాలో మహిళలు, విద్యార్థినుల పట్ల అఘాయిత్యాలు జరగకుండా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకమైన చర్యలు చేపడుతున్నాం. వారికి ఎలాంటి రక్షణ కల్పించాలన్న దృక్పథంతో జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఈ పోటీ ప్రపంచంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారు. అలాంటివారికి ఉద్యోగరీత్యా వేధింపులు, అఘాయిత్యాలు తరచూ జరుగుతున్నాయి వాటిని అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా నెలరోజులు పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం.

ప్ర : జిల్లాలో శాంతి భద్రతల విషయంలో తీసుకుంటున్న చర్యలు?

జ: జిల్లాలో యువత ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడకుండా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం.చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించి శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే వారు ఎలాంటి వారైనా ఉపేక్షించబోం. గంజాయి, డ్రగ్స్ ,కర్నాటక మద్యం అక్రమ రవాణా చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాం. జిల్లాలో కర్నాటక సరిహద్దు ప్రాంతం ఎక్కువ ఉన్న కారణంగా కొంతమేర నేరస్తులను వెంటనే గుర్తించలేకపోతున్నాం. అక్రమ రవాణా నిర్వహించే వారిపై సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపట్టి తగిన చర్యలు తీసుకుంటున్నారు.

3) ఇటీవల జిల్లాలో నేరాల సంఖ్య పెరిగిపోవడం పై మీ అభిప్రాయం?

జ : జిల్లావ్యాప్తంగా నేరాల సంఖ్య గతం కంటే ఈ సంవత్సరం తగ్గుముఖం పట్టింది. అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా నేరస్తులు మన జిల్లాలో దొంగతనాలకు పాల్పడం, చిన్న చిన్న విషయాలకు, భూ, స్థల సమస్యలకు, గొడవలకు కేసులు కావడంతో నేరాల సంఖ్య అధికంగా ఉంది. ముఖ్యంగా బంగారు, వెండి, డబ్బుల దొంగతనాలకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించి కోర్టులకు హాజరు పరుస్తున్నాం. ఇటీవల మూడు నెలలు లోపే దొంగలించిన రూ.40 లక్షల విలువ చేసే 301 సెల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశాం. ఎవరైనా బాధితులు ఎలాంటి వస్తువులను పోగొట్టుకున్న, దొంగలించబడినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

4) నేర నియంత్రణకు చేపట్టే చర్యలేవి?

జ : శ్రీ సత్య సాయి జిల్లాలో ఇటీవల యువతలో ఎక్కువ శాతం ఉద్యోగాలకు పనులకు వెళ్లకుండా సులభంగా డబ్బు సంపాదించే మార్గాల అన్వేషణలో పడ్డారు. అలాంటి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి, కళాశాలల్లో, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పోలీసులు పల్లెనిద్రలు, వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. నేరాలను పసిగట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాలను ఏర్పాటు చేశాం. లాడ్జులు, ఆసుపత్రులు, ప్రభుత్వ, ప్రైవేటు ,భవనాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటును ప్రోత్సహిస్తున్నాం. వీటి ద్వారా నేరాలను నియంత్రించడమే కాక నేరం జరిగిన చోట వ్యక్తులను వెంటనే గుర్తించవచ్చు. దాంతో నేరాలు సైతం తగ్గుముఖం పడతాయి.

శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ వి. రత్న

'ఛాంపియన్స్'

ఐసిసి ఛాంపియన్ ట్రోఫీలో భారత్ ఘన విజయం సాధించడంతో ఉమ్మడి జిల్లాలో క్రీడాభిమానుల సంబరాలు మిన్నంటాయి. యువత బైక్‌ర్యాలీలు నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో చేరుకుని బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు.

మోడల్ పరీక్షల నిర్వహణ

ప్రజాశక్తి-గుంతకల్లు

స్థానిక శ్రీసాయి మహిళా డిగ్రీ కళాశాలలో ఎపి కానిస్టేబుల్ మెయిన్స్, రైల్వే రిక్రూట్మెంట్, గ్రూప్-డి మోడల్ పరీక్షలను డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా పరీక్షల ప్రశ్నపత్రాలను తహశీల్దార్ రమాదేవి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగాల అన్వేషణలో ఉన్న నిరుద్యోగ యువత, గ్రామీణ ప్రాంత నిరుద్యోగ అభ్యర్థులకు మోడల్ పరీక్షలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ అవకాశం కల్పించిన డివైఎఫ్ఐ పట్టణ ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు, శ్రీ సాయి ఉమెన్స్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ప్రభాకర్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ సిసిఇ సిబ్బంది, డివైఎఫ్ఐ నాయకులు రంగా, తదితరులు పాల్గొన్నారు.

వరిసాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

వరిసాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి సరిత ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. వరిపొలంలో నాచు పేరుకుని ఉంటే పైరు పిలకలు సరిగా వేయదన్నారు. ఇలాంటి పొలాల్లో నీటిని క్రమబద్ధీకరించేందుకు రైతులు ప్రయత్నించాన్నారు. అలాగే పొలంలో సల్ఫైడ్ దుష్ప్రభావం వల్ల వరి వేరు వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని మొక్క గిడసబారిపోయి పెరుగుదల లోపిస్తుందని, నియంత్రించేందుకు పొలాన్ని చీమ నెర్రెలు వచ్చేంత వరకూ ఆరనివ్వాలన్నారు. గంధకం కలిగి ఉన్న అమ్మోనియం సల్ఫేట్ లేదా 20-20, 0-13 వంటి ఎరువులు వాడరాదన్నారు. యూరియా 35 కిలోలు, ఎంఒపి 15కిలోలతోపాటు 200 గ్రాముల కార్బన్‌డిజం, మాన్కోజెబ్ శిలీంద్ర నాశనిని కలిపి పొలంలో చల్లుకోవాలన్నారు. తర్వాత విడిగా 30 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్‌ను 10 లీటర్ల నీటిలో చొప్పున కలిపి నాచుపై పడే విధంగా పిచికారీ చేయాలన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

శింగనమల : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని సోదనపల్లి గ్రామంలో సిపిఐ నూతన గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదల జీవన ప్రమాణాలు రోజురోజుకూ దిగజారిపోతున్నాయన్నారు. ఎందుకంటే చాలామంది పేదలు నివసించడానికి ఇల్లు, సాగు చేసుకోవడానికి భూములు, చేసేందుకు పని లేకుండాపోయిందన్నారు. కావున గ్రామాల్లో సమస్యలు పరిష్కరించి ప్రజల జీవన ప్రమాణాలను పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యదర్శిగా బేల్దారి నల్లప్ప, సహాయ కార్యదర్శిగా మంచాల తిరుపాలుతోపాటు 9మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లప్ప, తిరుపాలు, లక్ష్మయ్య, హనుమప్ప, కె.ఆదెన్న, పెద్ద శివన్న, దుర్గన్న, రోగెన్న, రమేష్, గుర్రప్ప, నాగయ్య, రామ్మోహన్, యెంగల ఆదెన్న, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో నెరవేరనున్న వాల్మీకుల కల

ప్రజాశక్తి-రాయదుర్గం

వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ కళ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నెరవేర్చుతుందని వాల్మీకి ఎస్టీ పునరుద్ధరణ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని కోట వాల్మీకి కళ్యాణ మంటపం వద్ద సమితి రాయదుర్గం శాఖ తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు నీరుగంటి శ్రీనివాస్, కావలి రవి, ఈశ్వర్, ఆంజనేయులు, మల్లికార్జున, పవన్ మాట్లాడుతూ వాల్మీకుల చిరకాల కోరిక ఎస్టీ రిజర్వేషన్‌ను కూటమి ప్రభుత్వం నెరవేర్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్రాల్లో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున ఎస్టీ రిజర్వేషన్ సాధ్యమవుతుందన్నారు. ఇందుకు ఎమ్మెల్యేలు, ఎంపీలు కృషి చేయాలన్నారు.

అంగన్వాడీ కార్యకర్తల అరెస్టులు అక్రమం

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

అంగన్వాడీలు తమ సమస్యల పరిష్కారానికి మార్చి 10న విజయవాడలో శాంతియుతంగా తలపెట్టిన మహా ధర్నాని భగ్నం చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేయడాన్ని సిఐటియు అనంతపురం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ అన్నారు. ట్రైన్ లో ప్రయాణిస్తున్న మహిళ కార్యకర్తలను మగ పోలీసులు ద్వారా దింపించడం అనాగరికమైన చర్య అన్నారు. ఒకవైపు ప్రభుత్వ పెద్దలు మాది పరదాల ప్రభుత్వం కాదంటూనే తొమ్మిది నెలలకే నిర్బంధాన్ని ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అక్రమ అరెస్టుకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా సోమవారం నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనంతపురం నుండి వస్తున్న అంగన్వాడి కార్యకర్తలను కడప జిల్లా ఎర్రగుంట రైల్వే స్టేషన్లో ధర్మవరం ట్రైన్ నుండి దించేశారని. ఇలాంటి దుర్మార్గమైన చర్య వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు.

'యువత పోరు'తో ప్రభుత్వానికి హెచ్చరిక

కూటమి పాలనలో అన్ని వర్గాలకు మోసం-వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న 'యువత పోరు'ను విజయవంతం చేసి కూటమి ప్రభుత్వానికి హెచ్చరిక పంపుదామని వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వైసిపి జిల్లా కార్యాలయంలో యుజవన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 'యువత పోరు' సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేసిన పాపానపోలేదన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. రూ.1.30 లక్షల అప్పుల భారాన్ని ప్రజలపై మోపి ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా పూర్తిగా అమలు చేయలేదని తెలిపారు. అమ్మఒడి పథకాన్ని తల్లికి వందనంగా మార్చి తొలి ఏడాది ఎగనామం పెట్టారని విమర్శించారు. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.4200 చెల్లించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. కళాశాల యాజమాన్యాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్నాయని తెలిపారు. ఇక 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మోసం చేశారని మండిపడ్డారు. వైఎస్ జగన్ హయాంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుడితే వాటిని ప్రైవేట్ పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోందన్నారు. దీనివల్ల పేద కుటుంబాలకు చెందిన పిల్లలు వైద్య విద్యను అభ్యసించే అవకాశం లేకుండా పోతుందని తెలిపారు. ఈనెల 12న ఉదయం అనంతపురంలోని జెడ్పీ కార్యాలయం నుంచి 'యువత పోరు' ర్యాలీ ప్రారంభమై కలెక్టరేట్ వరకూ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అదేరోజు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. వైసిపి యువజన విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థి, యువత సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న 'యువత పోరు'ను విజయవంతం చేసి కూటమి ప్రభుత్వ మెడలు వంచుదామని పిలుపునిచ్చారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మానసపుత్రిక అయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని చంద్రబాబు ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. వైఎస్ జగన్ 2019లో సీఎం అయ్యాక అప్పటి టీడీపీ ప్రభుత్వం పెట్టిన రూ.1790 కోట్ల బకాయిలను సైతం చెల్లించిన విషయాన్ని గుర్తు చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారని తెలిపారు. చంద్రబాబు ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక అటకెక్కిస్తున్నారని మండిపడ్డారు. కూటమిలో భాగస్వామిగా ఉన్న పవన్ కళ్యాణ్ హామీల అమలు బాధ్యతను తీసుకోవాలన్నారు. సమావేశంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను సవరించాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌టియు నాయకులు

తప్పులతడకగా ఉన్న ఉపాధ్యాయ సీనియారిటీ జాబితాను సవరించాలని ఎస్‌టియు నాయకులు కోరారు. ఈమేరకు డిఇఒ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌టియు నాయకులు మాట్లాడుతూ సత్యసాయి జిల్లాలోని మారుమూల ప్రాంత ఉపాధ్యాయులు వినతులు ఇవ్వడానికి ఉమ్మడి జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన కేంద్రానికి రావడానికి చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. కావున రాష్ట్ర అధికారులతో సంప్రదించి శ్రీ సత్యసాయి జిల్లాకేంద్రంలోనే అభ్యంతరాలు సమర్పించేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఇంటర్ జిల్లా బదిలీల్లో జిల్లాకు వచ్చిన వివిధ క్యాడర్ల ఉపాధ్యాయులు జిల్లాలో చేరిన తేదీ వివరాలు కాకుండా వారి ఇనిషియల్ అపాయింట్ మెంట్ తేదీ వివరాలు ఉండటం వల్ల వివిధ సీనియారిటీ జాబితాలో సీనియర్ల కంటే జూనియర్లు ముందుగా ఉన్నారన్నారు. ముఖ్యంగా ఒకే ప్యానల్లో ఒకేసారి పదోన్నతి పొందినప్పటికీ కొందరు ప్రధానోపాధ్యాయులు చేసిన పొరపాటు, కొందరు ఉపాధ్యాయులు తమ స్వార్థంతో స్వప్రయోజనాలకోసం ఒకే సబ్జెక్టులో డేట్ ఆఫ్ జాయినింగ్ అందరికీ ఒకే డేట్ కాకుండా వేర్వేరుగా వేశారన్నారు. ఇందుకు స్పందించిన డిఇఒ ఒకేసారి ప్రమోషన్ తీసుకున్న వారికి ఒకే సబ్జెక్ట్‌లో కామన్ జాయినింగ్ తేదీ ఉండాలని, వేర్వేరుగా ఉండటం తమ దృష్టికి వచ్చిందని వాటిని సరి చేస్తామన్నారు. ఎవరికీ అన్యాయం జరక్కుండా అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి సీనియారిటీ లిస్ట్‌లను తయారు చేస్తామన్నారు. తన దృష్టికి వచ్చిన ప్రతి అంశాన్ని జాగ్రత్తతో పరిశీలించి సీనియారిటీ లిస్టులో పొందుపరిచి డిఇఒ బ్లాగ్‌లో ఉంచుతామన్నారు. డిఇఒను కలిసిన వారిలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు ఎన్.రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జి.సూర్యుడు, రాష్ట్ర కార్యదర్శి కె.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి జి.మల్లిఖార్జున, జి.నారాయణస్వామి, బికెఎస్ మండల నాయకులు రామాంజనేయులు, ఆత్మకూరు మండల అధ్యక్షులు వై.రవి, తదతరులు ఉన్నారు.

మహిళల ఆర్థిక పురోభివృద్ధే ధ్యేయం

బంగారు కొనుగోలుపై రుణం-అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్ మురళీధర్

ప్రజాశక్తి-అనంతపురం

కార్యక్రమంలో మాట్లాడుతున్న అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్ మురళీధర్

మహిళల ఆర్థిక పురోభివృద్ధే ధ్యేయంగా అర్బన్ బ్యాంకు ముందుకు వెళ్తోందని బ్యాంకు ఛైర్మన్ జెఎల్ మురళీధర్ అన్నారు. ఆదివారం నగరంలోని సుభాష్ రోడ్డులో ఉన్న శ్రీకృష్ణదేవరాయ భవన్‌లో అనంతపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 109వ మహా జనసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్బన్ బ్యాంకు 2024-2025 ఆర్థిక సంవత్సరంలో ఆర్థికపరంగా ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. ఇందుకు పాలకవర్గ సభ్యులు, సిబ్బంది అహర్నిశలు శ్రమించారన్నారు. ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించడానికి జిల్లాలో ఏ బ్యాంకు ఇవ్వని విధంగా డిపాజిట్‌లపై అత్యధిక వడ్డీ శాతాన్ని ఖాతాదారులకు ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే గృహ నిర్మాణాలు, బంగారుపై రుణాలు, చిన్న, చిన్న వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారులు, విద్యకు సంబంధించిన లోన్‌లకు తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా ఈ సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్త పథకాన్ని ప్రవేశపడుతున్నామన్నారు. ప్రతి మహిళ బంగారును కొనాలని మహాలక్ష్మి పథకం ద్వారా కేవలం 25 శాతం చెల్లిస్తే నచ్చిన బంగారు దుకాణాల్లో ఆభరణాలు కొనడానికి రుణం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళామణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం బ్యాంకు సిఇఒ ఎం.విజయభాస్కర్ 2024-25 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు వైస్ ఛైర్మన్లు జె.వెంకటాద్రి, గోల్డ్ బాషా, సుంకర రమేష్, బి.రమణయ్య, పి.కృష్ణకుమార్, జె.రామాంజనేయులు, మాగిశెట్టి చంద్రశేఖర్, రొళ్ల భాస్కర్, చింతా భాస్కర్, సుబ్రమణ్యం, పుల్లప్ప, బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది, డిపాజిట్‌దారులు పాల్గొన్నారు.

రథోత్సవానికి తరలివచ్చిన అశేష జనవాహిని

కమనీయం.. గవిమఠం చంద్రమౌళీశ్వరుడి రథోత్సవం

భారీగా తరలివచ్చిన భక్తులు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఆంధ్ర, కర్నాటక రాష్ట్రాల్లో అతిపెద్ద ధార్మిక మఠం ఉరవకొండలోని గవిమఠం శ్రీచంద్రమౌళీశ్వర స్వామివారి రథోత్సవం ఆదివారం సాయంత్రం వేలాదిమంది భక్తుల కోలాహలాల మధ్య నేత్రపర్వంగా సాగింది. రథోత్సవానికి భారీగా భక్తులు తరలిరావడంతో గవిమఠ ప్రాంగణం కిటకిటలాడింది. ఈ సందర్భంగా గవిమఠం పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్ర స్వామి, ఉత్తరాధికారి శ్రీకరిబసవ రాజేంద్ర స్వామి, ఆదోని చౌకి మఠం మఠాధిపతి శ్రీకల్యాణి స్వామి, గవిమఠం సహాయ కమిషనర్ రాణి ఆధ్వర్యంలో అర్చకులు తెల్లవారుజాము నుంచి చంద్రమౌళీశ్వర స్వామి, గవిసిద్దేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి రథంపై కొలువుదీర్చారు. అనంతరం అశేష భక్త జనవాహిని చేసిన శివ నమస్మరణల మధ్య చంద్రమౌళీశ్వరస్వామి మహా రథోత్సవం వైభవంగా సాగింది. భక్తులు పూలు, పండ్లు రథంపై విసిరి తమ మొక్కులు తీర్చుకుని భక్తిని చాటుకున్నారు. స్వామివారి మూల విరాట్ ను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. జిల్లా వాసులే కాకుండా ఏపీ, కర్ణాటక రాష్ట్రాల నుండి వేలాది మంది భక్తులు రథోత్సవానికి తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ శ్రీనివాసులు, తహశీల్దార్ మహబూబ్ బాషా, సిఐలు చిన్న గౌస్, మహానంది ఎస్ఐల ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గవిమఠం ఏజెంట్ రాజన్న గౌడ్, వీరశైవ సంఘం నాయకులు, ఆలయ సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ జడ్పిటిసి జయసింహకు నివాళి

నివాళులర్పిస్తున్న ఆకుల బాబు

నార్పల : మాజీ జడ్పిటిసి ఆకుల జయసింహ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు, ఆకుల కుటుంబ అభిమానులు ఆదివారం నివాళులర్పించారు. ఇందులో భాగంగా జయసింహ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సెవెన్‌హిల్స్ కళ్యాణ మండపంలో భారీ ఎత్తున అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయసింహ భౌతికంగా దూరమై 11ఏళ్లు అవుతున్నా ఆయన చేసిన మంచి పనులతో ఆకుల కుటుంబ అభిమానులు, నిరుపేదల గుండెల్లో నిలిచే ఉన్నారన్నారు. అనంతరం జయసింహ ఘాట్ వద్ద పూలమాలలు వేసి టెంకాయ కొట్టి నివాళుర్పించారు ఈ కార్యక్రమంలో ఆకుల కుటుంబ సభ్యులు, టిడిపి నాయకుడు ఆకుల విజయకుమార్ (బాబు) ,మాజీ కోఆప్షన్ సభ్యులు సలేహ, వార్డు సభ్యులు నాగభూషణం, మాజీ ఎంపిటిసి వేణుగోపాల్, నలపురెడ్డిపల్లి రమేష్, ఇస్మాయిల్, రామాంజనేయులు, పవన్‌కుమార్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

'పోరుబాట'ను విజయవంతం చేయండి

శింగనమల : జిల్లాకేంద్రంలో 12న నిర్వహించనున్న యువత పోరుబాట ర్యాలీ కార్యక్రమానికి విద్యార్థులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వైసిపి నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైసిపి ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కావున విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు

మాజీ మేయర్ స్వరూపకు సన్మానం

అనంతపురం రూరల్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ మేయర్ మదమంచి స్వరూపను ఆమె నివాసంలో కార్పొరేషన్‌లోని మెప్మా రీసోర్స్‌పర్సన్స్ మహిళలు ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా స్వరూప మేయర్‌గా బాధ్యతలు నిర్వహించిన కాలంలో డ్వాక్రా సంఘాల అభివృద్ధికి చేసిన కృషిని గుర్తు చేసుకుంటూ కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ మేయర్‌ను సన్మానిస్తున్న మహిళలు

మహిళలను గౌరవించినప్పుడే సమాజాభివృద్ధి

అతిథులను సన్మానిస్తున్న పెన్షనర్స్

అనంతపురం కలెక్టరేట్ : మహిళలను గౌరవించే సమాజం అభివృద్ధి చెందుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని పెన్షనర్స్ భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ నాయకులు సావిత్రిదేవి ఆహ్వానితులుగా నాగరాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథులుగా పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షులు బి.పెద్దన గౌడ్, ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప, రిటైర్డ్ ప్రిన్సిపాల్ నిర్మల, సీనియర్ సిటిజన్ ఏ.జి.ప్రమీలమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర ఎంతో గొప్పదన్నారు. నేడు పురుషులతో ధీటుగా అన్నిరంగాల్లో రాణిస్తూ ఉన్న స్థానాల్లో నిలుస్తున్నారని తెలిపారు. అనంతరం అనంత ఆశ్రయ అనాథ శరణాలయం దేవి, సైకాలజిస్ట్ లహరి, తలసేమియా వారియర్ అయేషాలను సావిత్రి దేవి, కె.ఆదిలక్ష్మి, శీలా జయరామప్ప, ప్రభాకర్, అనంతయ్యను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ అధ్యక్షులు రమణ, జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవ సలహాదారు గోవింద రాజులు, ఉపాధ్యక్షులు దేనియల్ ప్రభాకర్, చంద్రశేఖర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు వరదరాజులు, జయరామ్, తదితరులు పాల్గొన్నారు.

14న జనసేన ఆవిర్భావ దినోత్సవం

ఉరవకొండ : ఈనెల 14న పిఠాపురంలో జరగబోయే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌతమ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం ఉరవకొండలో మండల అధ్యక్షులతో కలిసి ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, బెలుగుప్ప మండల అధ్యక్షులు సుధీర్ నాయకులు రమేష్, మణికుమార్, సాయి, నీలకంఠ, బోగేష్, వంశీ, రఘు, సోము, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న జనసేన నాయకులు

కొండపై చెట్లకు నిప్పు

రాయదుర్గం : పట్టణ సరిహద్దున ఉన్న యల్లమ్మ కొండపై చెట్లకు ఆదివారం సాయంత్రం మంటలు అంటుకున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు చెట్లకు నిప్పు పెట్టి ఉండవచ్చని భావిస్తున్నారు. ప్రతి ఏడాది వేసవికాలంలో తరచూ కొండపై ఉన్న చెట్లకు నిప్పు పెడుతుండటంతో చెట్లు కాలిపోతూ ఉంటాయి. దీంతో కొండపై పచ్చదనం అంతరించిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ, రెవెన్యూ అధికారులు స్పందించి నిప్పు పెట్టకుండా చర్యలు చేపట్టాని ప్రజలు కోరుతున్నారు.

కొండలో చెలరేగుతున్న మంటలు

వైసిపి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-గుత్తి

రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వైసిపి నాయకులు అన్నారు. నూతనంగా ఎన్నికైన వైసిపి పట్టణ, మండల అధ్యక్షులు కె.మధుసూదన్‌రెడ్డి, జి.గంగరాజు యాదవ్‌ను ఆదివారం గుత్తి ఆర్ఎస్‌లో ఘనంగా సన్మానించారు. ముందుగా దివంగత నేత, మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. అనంతరం వైసిపి పట్టణ, మండల అధ్యక్షులకు శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా కె.మధుసూదన్‌రెడ్డి, జి.గంగరాజుయాదవ్ మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తమను ఎన్నుకున్న అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.వెంకట రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, వైస్ ఛైర్‌పర్సన్ బి.పద్మలత, నాయకులు డి.హుస్సేన్‌పీరా, సి.మల్లయ్యయాదవ్, వై.సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బళ్లారి రాజకుమార్‌రెడ్డి, ఎం.రంగస్వామి, డాక్టర్ ఎం.శాంతిప్రియ, బి.హరినాథ్‌రెడ్డి, మార్తాడ్ అన్సర్, బి.హరినాథ్‌రెడ్డి, బి.రమేష్‌రెడ్డి, సివి రంగారెడ్డి, ఎల్ఐసి హరినాథ్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, షేక్ చాంద్‌బాషా, డి.సూర్యప్రకాష్, ప్రశాంత్, రాజేష్, వెంకీ, కౌన్సిలర్లు వరదరాజులు, ఎస్.ఫారూఖ్, అరవింద్, కెవి.రమణ, వెంకటసుబ్బయ్య, ఖాజాఖాన్, తదితరులు పాల్గొన్నారు.

నాట్యం చేస్తున్న చిన్నారులు

శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం : సంస్కృతి, సంప్రదాయాల సమాహారం శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా అనంతపురానికి చెందిన తాత్విక సాయి బృందం భరతనాట్య, నృత్య ప్రదర్శనలు చేశారు.

ప్రభుత్వాసుపత్రికి ఫొటోథెరపీ వితరణ

తాడిపత్రి : తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి పెన్షనర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో సుమారు రూ.50వేలు విలువజేసే ఫొటోథెరపీని అందజేశారు. ఈమేరకు మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డితో ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డికి ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సత్యప్రసాద్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు హనుమంతురెడ్డి, సంగటి వీరారెడ్డి, గోపాల్‌రెడ్డి, ఆశ్వర్థరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫొటోథెరపీని అందజేస్తున్న దృశ్యం

రైతులను ఆదుకోవాలి

సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్

ప్రజాశక్తి-శింగనమల

పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

2024-25 ఖరీఫ్, రబీ సీజన్‌లో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని రాచేపల్లి గ్రామంలో సిపిఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరప, పత్తి, పప్పుశనగ, సీడ్ జొన్న, తదితర పంటలు సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం, బీమా ప్రకటించి రైతులు, కౌలురైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో ఈనెల 7వతేదీ ఉరవకొండ నుంచి పాదయాత్ర ప్రారంభమైన విషయం తెలిసిందే అన్నారు. ఈ పాదయాత్ర నేడు ముగిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు రైతులు, కౌలు రైతులు, కార్మికులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్యప్రకాష్, సుంకన్న, రామాంజనేయులు, నాగేంద్ర, కుళ్లాయిస్వామి, జయరాముడు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నెల రామాంజినేయులు

ప్రజాశక్తి-గుంతకల్లు

సమావేశంలో మాట్లాడుతున్న మన్నెల రామాంజినేయులు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించడంతోపాటు కార్మికుల పెండింగ్ క్లైముల పరిహారానాన్ని చెలించాలని సిఐటియు అనుబంధ భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నెల రామాంజినేయులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మస్తాన్‌పేట సుంకులమ్మ ఆలయం వద్ద భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా భవన నిర్మాణ కార్మికులకు చెల్లించాల్సిన వివాహాలు, ప్రసవాలు, సహజ, ప్రమాద మరణాలకు పరిహారాలు చెల్లించాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల పిల్లల చదువులకు ఉపకార వేతనాలు ఇవ్వాలన్నారు. స్టీల్, సిమెంట్ ధరలు తగ్గించాలని, ఇసుక ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. 2019 నుంచి ప్రమాదాలు, అనారోగ్యంతో మరణించిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి సాకే నాగరాజు, ఎపి బిల్డింగ్, అండర్ కన్స్ట్రక్షన్ వర్కర్ యునియన్ పట్టణ కమిటీ నాయకులు ఎస్‌కెఎం బాషా, సిఐటియు పట్టణ అధ్యక్షులు జగదీష్, నాయకులు చిన్న, శ్రీకాంత్, శేఖర్, ఎర్రిస్వామి, అంజి, మహి, సుధీర్, వసంత, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు

దాదాపు మూడు దశాద్దాల తర్వాత పాత మిత్రులు ఒకచోట కలుసుకున్నారు. కళ్యాణదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 30ఏళ్ల కిందట బిఎ, బికాం చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఇందులో భాగంగా ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తర్వాత ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అప్పట్లో అధ్యాపకులుగా పని చేసిన ప్రస్తుతం ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి, విశ్రాంత లెక్చరర్లు చెంగలయ్య, సురేష్, సురేష్, నాగరాజరావు, ఎంవి.శేషయ్య, రాధాకృష్ణ, చక్రవర్తి, కళాశాల బోధనేతర సిబ్బంది చంద్రమౌళిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపిన నిర్వాహకులు శివానంద, చల్లా కిషోర్, పాతిరెడ్డి, బషీర్, జోషఫ్ కిషోర్, రవిప్రసాద్, బంగి రామ్మోహన్‌ను అభినందించారు.